క్లుప్తంగా

నాటుసారా నియంత్రణకు కట్టుదిట్ట చర్యలు



ఎక్సైజ్ స్టేషన్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ శాఖ డీపీఈఓ గోవిందనాయక్

ధర్మవరం అర్బన్: నాటుసారా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ పుట్టపర్తి డీపీఈఓ గోవిందనాయక్ తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0లో కేసులు నమోదు చేయడం, నాటుసారా లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బైండోవర్స్‌పై పూర్తి శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ హరికృష్ణ, ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్‌ఐలు నాగరాజు, చాంద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పోతలయ్య స్వామికి గావులు



పోతలయ్య స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: ఒంటికొండ గ్రామంలో ఉగాది పండగ సందర్భంగా మంగళవారం పోతలయ్య స్వామికి గావుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా. ఈసందర్భంగా ఉదయం పోతలయ్య స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం జరిగిన గావుల కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఎగబడ్డారు.

హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు ఆపండి



హంద్రీ–నీవా కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ముదిగుబ్బ: హంద్రీ–నీవా కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులను ఆపాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం నాయకులు మల్లమ్మ కొట్టాల సమీపంలో ఉన్న హంద్రీ–నీవా కాలువను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైనింగ్ పనుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. కాంక్రీట్ లైనింగ్ చేస్తే భూగర్భ జలాలు ఇంకకుండా బోర్లు ఎండిపోయే ప్రమాదముందన్నారు. అలా కాకుండా కాలువను వెడల్పు చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చెరువులను పూర్తిస్థాయిలో నింపాలన్నారు. ముదిగుబ్బ వద్ద ఉన్న యోగివేమన రిజర్వాయర్‌ను నీటితో నింపాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెనుకొండ హరి, జంగాలపల్లి పెద్దన్న, మారుతి, ఆటోపెద్దన్న, పోతులయ్య, పక్కీరప్ప, సుధాకర్‌రెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసు నిందితులను కఠినంగా శిక్షించండి



సీఐకు వినతిపత్రాన్ని అందిస్తున్న రాజహంస శ్రీనివాసులు

రామగిరి: కురుబ లింగమయ్య హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పాపిరెడ్డిపల్లిలో గ్రామానికి చెందిన కురుబ లింగమయ్య ఆదివారం దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. మంగళవారం ఆయన కురుబ సంఘం నాయకులతో కలిసి రామగిరి సీఐ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగమయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. అలాంటి వ్యక్తిని దారుణంగా హతమార్చి రాజకీయాలు అంటగట్టడం సరికాదన్నారు. హత్యా రాజకీయాలకు అమాయకులను బలిచేయొద్దని కోరారు. లింగమయ్య హత్యను కురుబ సంఘం హేయమైన చర్యగా భావిస్తోందన్నారు.

నేడు వారపు సంత వేలం

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి వారపు సంత సుంకం వసూలుకు సంబంధించి 2025–26 వార్షిక సంవత్సరానికి గాను సర్పంచ్ మంగ్లీబాయి ఆధ్వర్యంలో బుధవారం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. పంచాయతీ కార్యాలయంలో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

లక్ష్య సాధనలో చతికిల

పట్టణ అభివృద్ధి సజావుగా సాగాలంటే పన్నుల వసూళ్లు చాలా కీలకం. ఆస్తి, నీటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్సుల ద్వారా ఫీజులు వసూలు చేయాలి. అయితే పుట్టపర్తి మున్సిపాలిటీలో మాత్రం పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్యాన్ని సాధించడంలో అధికారులు విఫలమయ్యారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసింది. మున్సిపాలిటీలో 40 శాతం మాత్రమే పన్నులు వసూలు చేశారు. ఇంకా 60 శాతం వసూళ్లు కావాల్సింది.

- మున్సిపాలిటీలో పన్నుల వసూలు పల్టీ
- టార్గెట్ రూ.7.31 కోట్లు.. వసూలు రూ.3.06 కోట్లు
- ప్రభుత్వ శాఖలకు నోటీసులతోనే సరి.. కలెక్షన్లు నిల్



మున్సిపాలిటీ కార్యాలయం

పుట్టపర్తి టౌన్: పన్నుల వసూళ్లలో పుట్టపర్తి మున్సిపాలిటీ వెనుకబడింది. 20 వార్డుల పరిధిలో 14,101 గృహాలు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7,31 కోట్ల ఇంటి పన్నులు వసూలు చేయాలి. అందులో రూ.3.06 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. 3,496 కొళాయి కనెక్షన్లకు సంబంధించి నీటి పన్ను రూపంలో రూ.85.92లక్షలకు గాను రూ.39.02 లక్షలు వసూళ్లు చేశారు. ఖాళీ స్థలాలకు సంబంధించి 303 అసెస్‌మెంట్ల నుంచి రూ.49,23,311కు గాను రూ.14.02 లక్షలు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

వడ్డీ మాఫీ ఆఫరూ అంతంతే

ఆస్తి పన్నులు వంద శాతం వసూళ్లు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీగా ప్రకటించింది. ఈ ఆఫర్ కూడా వసూళ్లలో అంతంతమాత్రంగానే ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసినా లక్ష్యం చేరుకోలేకపోయారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందకపోవడం.. ఆశించినంత స్థాయిలో పంటలు చేతికందకపోవడం, వ్యాపారాలు సాఫీగా జరగపోవడంతో పన్నులు చెల్లించలేని స్థితిలో ఉన్నారు.

ప్రభుత్వ శాఖల తాత్సారం

వివిధ ప్రభుత్వ శాఖల తరఫున స్థిర, చరాస్తులకు సంబంధించి పురపాలక సంఘానికి పన్నులు రావాల్సి ఉన్నాయి. సామాన్యులను ముక్కుపిండి వసూళ్లు చేసే మున్సిపల్ అధికారులు ప్రభుత్వ శాఖలపై మాత్రం ప్రేమ చూపిస్తున్నారు. నోటీలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. పన్నుల బకాయిల వసూలును గాలికి వదిలేశారు. మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి 13 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వాటి నుంచి రూ.38 లక్షల మేర పన్నులు రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఒక అసెస్‌మెంట్ నుంచి రూ.9 లక్షలు పన్ను రూపంలో రావాలి. అయితే ఆయా ప్రభుత్వ శాఖలు తాత్సారం చేస్తున్నాయి.

పన్నులు చెల్లించి సహకరించండి



ఆర్థిక సంవత్సరం ముగిసినా బకాయిదారులు పన్నులు చెల్లించవచ్చు. మొండి బకాయిలకు కూడా నోటీసులు జారీ చేస్తున్నాం. క్షేత్రస్థాయిలోకి వెళ్లి మున్సిపాలిటీ అభివృద్ధి కార్యాక్రమాలు తెలియజేసి వసూళ్లు చేస్తాం. అప్పటికీ స్పందించని పక్షంలో కొళాయి, డ్రెయినేజీ కనెక్షన్లు కట్ చేస్తాం. పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్‌కు రెవెన్యూ అధికారులు సచివాలయ ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తాం. ప్రభుత్వ శాఖలకు కూడా నోటీసులు జారీ చేశాం. వాటి నుంచి కూడా వసూళ్లు చేస్తాం. పట్టణ ప్రజలు బకాయిలు చెల్లించి పట్టాభివృద్ధికి సహకరించాలి.

– ప్రహ్లాద,
మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

పింఛన్ల పంపిణీ పరిశీలన



పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత పింఛన్లు మంగళవారం సజావుగా సాగింది. జిల్లా వ్యాప్తంగా 262707 మంది పింఛన్‌దారులకు రూ.114.26 కోట్లు మంజూరైంది. తొలిరోజు సాయంత్రానికే 2,43,648 మందికి పింఛన్లు అందజేశారు. జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ, జేసీ అభిషేక్ కుమార్ పెనుకొండ మండలం రాంపురం పంచాయతీలో పర్యటించి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అక్కడ అంజినప్ప, గంగమ్మ, రత్నమ్మ అనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మెప్మా టీపీఆర్ఓ విజయభాస్కర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కదిరి అర్బన్: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ మంగళవారం చేపట్టారు. కె.బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని పింఛన్లు అందజేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారు. రెండు రోజుల్లో స్థలం కేటాయించాలని తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్పను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం గ్రామంలో పశువులు నీటి తొట్టేల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

నీటితొట్టెల నిర్మాణాలకు భూమిపూజ

నల్లచెరువు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల కోసం తాగునీటి తొట్టెల నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా నల్లచెరువు మండలం ఎం.అగ్రహారం పంచాయతీలో మంగళవారం పశువుల తాగునీటి తొట్టె నిర్మాణానికి ఎంపీడీఓ రఘునాథ గుప్తా, ఏపీఓ మంజుల, సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి పశువులు ఇబ్బంది పడకుండా తొట్టెలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

గాండ్లపెంట: కటారుపల్లిలో రూ.34,407 అంచనాతో నీటితొట్టె నిర్మాణానికి ఉపాధి హామీ సిబ్బంది మంగళవారం భూమిపూజ చేశారు. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీల పరిధిలో 55 తొట్టెలను ఉపాధి హామీ పథకం కింద చేపడతామని ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఏపీఓ మంజూనాథ్ తెలిపారు.

ఎన్‌పీకుంట: వేసవిలో పశువుల దాహార్తి తీర్చడం కోసం మండల వ్యాప్తంగా 67 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. వీటిని ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్నట్లు ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో కలిసి ఆయన నీటితొట్టెల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ధర్మవరం రూరల్: నిమ్మలకుంటలో పశువుల దాహార్తి తీర్చే నీటి తొట్టె నిర్మాణానికి ఏపీపీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎంపీడీఓ సాయిమనోహర్ మంగళవారం భూమిపూజ చేశారు. మండల వ్యాప్తంగా రూ.25,57,950 ఉపాధి హామీ నిధులతో 77 తొట్టెలు నిర్మించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళి, టీఏ చంద్రకళ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజ, ఎఫ్‌ఏ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రమణ పాల్గొన్నారు.

తలుపుల : లక్కసముద్రం గ్రామంలో పశువులకు తాగునీటి కోసం తొట్టె నిర్మాణానికి ఎంపీడీఓ రామానాయక్, సర్పంచ్ తులశమ్మ మంగళవారం భూమి పూజ చేశారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు



గాండ్లపెంట ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

గాండ్లపెంట: పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. గాండ్లపెంటలోని ఉన్నత పాఠశాల 'ఏ' కేంద్రంగా, కటారుపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం 'బి' కేంద్రంగా 7 రోజుల పాటు పరీక్షలు జరిగాయి. 346 మంది విద్యార్థులకు ముగ్గురు మాత్రమే పరీక్షలకు గైర్హాజరయ్యారు.

బత్తలపల్లి: ఫిబ్రవరి 17న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. బత్తలపల్లిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 430 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 427 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ తెలిపారు. చివరిరోజు సాంఘిక శాస్త్రం పరీక్ష అయిపోగానే విద్యార్థులందరూ ఆయా పాఠశాలలకు చేరుకుని రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు.

చెన్నేకొత్తపల్లి: ఏపీ మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో గత నెల17న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్ష జరిగింది. మొత్తం 288 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలియజేశారు. పదో తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంలో మునిగిపోయారు.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని కమిషనర్‌కు అందజేస్తున్న గంగాదేవి

కదిరి టౌన్: మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు ఆమె తెలిపారు.

కూటమి పాలనలో బీసీలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు

తాడిమర్రి: కూటమి పాలనలో బీసీలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు ఆరోపించారు. మంగళవారం ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామాపురం సర్పంచ్ పుల్లయ్య, కునుకుంట్ల అనీల్, భీమరాయునిపేట కాటమయ్య తదితర కురుబ సామాజికవర్గం నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను టీడీపీ నాయకులు హత్య చేశారన్నారు. రాజకీయ ప్రాబల్యం కోసమే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యలకు తెగబడుతున్నారన్నారు. కురుబ లింగమయ్యను హత్య చేస్తే ఆ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు భయాందోళనకు గురై రాజకీయాలకు దూరంగా ఉండాలనే దురుద్దేశంతోనే ఇలాంటి ఘాతుకానికి పాల్పడ్డారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కురుబ సామాజిక వర్గానికి చెందిన ఎంపీలు, మంత్రులు ఉన్నప్పటికీ కురుబ లింగమయ్య హత్యను ఖండించకపోవడం శోచనీయమన్నారు. కురుబ సామాజికవర్గం నాయకులు, కార్యకర్తలు పార్టీలకు అతీతంగా సామాజిక వర్గం మనుగడ, రక్షణ కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా బీసీలపై ఇలాంటి దాడులు కానీ, హత్యలు కానీ జరుగలేదన్నారు. కార్యక్రమంలో ఆర్వేటి శివ, ఆర్వేటి గురుప్రసాద్, లక్ష్మన్న, హరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ధర్మవరం: రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయుబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సీఐటీయూ నాయకులు మున్సిపల్ కార్మికులతో కలిసి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, కాంట్రాక్టు పద్ధతి రద్దు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను నట్టేట ముంచే విధంగా ఆప్కాస్ పద్ధతిని రద్దు చేసి కాంట్రాక్టు పద్ధతిని మళ్లీ అమలు చేయాలనే ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం రూపొందిస్తోందని విమర్శించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని అమలు చేసి కార్మికులకు వేతనాలు పెంచి ప్రతినెలా వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయాలని ఆలోచిస్తోందన్నారు. ఇలాంటి దుర్మార్గమైన ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

పశుబీమా పథకం సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి: పాడిరైతులు, జీవాల పెంపకందారులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, డి.చెర్లోపల్లి పశువైద్యులు డాక్టర్ గుర్నాథరెడ్డి కోరారు. మంగళవారం వారు బత్తలపల్లిలోని ప్రాంతీయ పశువైద్యశాలలో విలేకర్లతో మాట్లాడారు. రూ.30వేలు ఖరీదు చేసే పాడి ఆవు లేదా గేదెకు మూడు సంవత్సరాలకు ప్రీమియం రూ.288 మాత్రమేనన్నారు. రూ.15వేలు ఖరీదు చేసే నాటు రకం పాడి ఆవు లేదా గేదెకు మూడు సంవత్సరాలకు గాను రూ.144 కట్టాల్సి ఉంటుందన్నారు. గొర్రెలు, మేకలుకు రూ.6వేలు ధరకు ఒక సంవత్సరం అయితే రూ.36, రెండు సంవత్సరాలకు అయితే రూ.40, మూడు సంవత్సరాలకు అయితే రూ.56 ప్రీమియం కట్టాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు రైతు సేవ కేంద్రాల్లోని పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

శ్రీరామనవమి వేడుకలకు ఎస్పీకి ఆహ్వానం



ఎస్పీరత్నను ఆహ్వానిస్తున్న ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: గోరంట్ల మండలం కరావులపల్లి సమీపంలో వెలసిన శివుడు, ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాలని ఎస్పీ రత్నను దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు వారు మంగళవారం పుట్టపర్తిలో ఎస్పీ బంగ్లా వద్ద ఎస్పీని కలిశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 6న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సీతారాముల కల్యాణోత్సవం అనంతరం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.లక్ష, రెండో బహుమతి కింద రూ.70వేలు, మూడో బహుమతి కింద రూ.50 వేలు, నాల్గో బహుమతి కింద రూ.40వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వేడుకలకు హాజరవుతానన్నారు. ఎస్పీని కలసిని వారిలో ఆలయ నిర్వాహకులు సునీతా శంకర్‌లాల్ నాయక్, గోరంట్ల జెడ్పీటీసీ మెంబర్ పాలే జయరామ్‌నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ ఏడీ శ్రీరామ్‌నాయక్, పుట్టగుండ్లపల్లి శివారెడ్డి, శ్రీనివాస్‌నాయక్, రాజేష్‌నాయక్, రామస్వామి నాయక్‌తోపాటు కరావులపల్లి తండా వాసులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలు



వెంకటగారిపల్లిలో గ్రామదేవత సత్యమ్మకు బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు



ఉట్టిమాను కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు



కునుకుంట్లలో ఓసూరమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: వెంకటగారిపల్లిలో గ్రామదేవత సత్యమ్మకు గ్రామస్తులు మంగళవారం బోనాలు సమర్పించారు. ఏటా ఉగాది పండుగ మరుసటి దినం బోనాలు పట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది మరుసటి దినం సోమవారం కావడంతో మంగళవారం చేపట్టారు. గ్రామ నడిబొడ్డున ఉన్న సత్యమ్మ తల్లిని గ్రామస్తులు పూలతోనూ, ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి కొత్త కుండలో చేసిన తీపి అన్నం, నారికేళాలు, పూలను తీసుకుని ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకున్నారు. పూజలు అనంతరం మూగజీవాలను సత్యమ్మ తల్లికి బలి ఇచ్చారు.

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెల గ్రామంలో వెలసిన గ్రామదేవతలకు మంగళవారం గ్రామస్తులు జ్యోతులు, బోనాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు జ్యోతులు, బోనాలను తలపై ఉంచుకుని ఊరేగింపుగా పెద్దమ్మ, సప్పలమ్మ దేవతల ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ జాతర

నల్లచెరువు: ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని ఓరువాయి, నల్లచెరువు గ్రామాల్లో రేణుకా ఎల్లమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామాల్లో డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి బోనాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రాజేంద్రనగర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో మంగళవారం భక్తులు జ్యోతుల బోనాలు సమర్పించారు. పూజారి సాకే రాజా ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

గ్రామ దేవతలకు జంతుబలులు

బత్తలపల్లి: ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం పలు గ్రామాల ప్రజలు ఆలయాల్లో దేవతా విగ్రహాల ముందు జంతుబలులు నిర్వహించారు. వెంకటగారిపల్లి, ఎం.చెర్లోపల్లి, పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ముష్టూరు, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, సంజీవపురం, యర్రాయపల్లి, జ్వాలాపురం, అప్పరాచెరువు, చెన్నరాయపట్నం, ఓబుళాపురం, పత్యాపురం, డి.చెర్లోపల్లి, నల్లబోయనపల్లి, ముద్దనపల్లి, కాటమకుంట, ఉప్పర్లపల్లి, దంపెట్ల, జలాలపురం తదితర గ్రామాల ప్రజలు జంతుబలులు ఇచ్చి.. పంటలు పుష్కలంగా పండాలని దేవతలను వేడుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో టెంకాయలు, చీనీపండ్లు విసురుతూ పందేలు ఆడారు.

తాడిమర్రి: మండలంలోని తాడిమర్రి, కునుకుంట్ల, మద్దులచెరువు, రామాపురం, కునుకుంట్లలోని ఎల్లమ్మ దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు బోనాలు, కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కునుకుంట్లలోని ఓసూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

చౌడేశ్వరమ్మా... కాపాడు తల్లీ!

అమడగూరు: అమ్మలు గన్న అమ్మ చౌడేశ్వరమ్మా.. కాపాడు తల్లీ అంటూ గ్రామస్తులు వేడుకున్నారు. చౌడేశ్వరీదేవి అమ్మవారి ప్రతిమ గ్రామాల ఊరేగింపులో భాగంగా మంగళవారం ఎ.పుట్లవాండ్లపల్లిలో సాగింది. గ్రామస్తులు అమ్మవారిని డప్పు, వాయిద్యాల నడుమ ప్రతి ఇంటికీ తీసుకెళ్లి పూజలు చేశారు. కొంతమంది సంతానం కోసం అమ్మవారికి వడివేలు సమర్పించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారిని గ్రామ నడిబొడ్డున కొలువుదీర్చి మహిళలు కొబ్బరికాయలను కొట్టారు. పూజల తర్వాత నడిరాత్రి అమ్మవారిని గాజులపల్లికి చేర్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ధర్మవరం అర్బన్: పదో తరగతి పరీక్షలు రాసి, పాలిసెట్–2025కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఈ నెల రెండో తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీ సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 30న 'పాలిసెట్' నిర్వహించనున్నారన్నారు. పాలిసెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ కాలంలో స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముగ్గురు నిందితులకు రిమాండ్

కదిరి టౌన్: పట్టణంలో పాత టీటీడీ కళ్యాణమండపం వద్దగల వెహికల్ పార్కింగ్‌లో బాయ్‌గా పనిచేస్తున్న సోమశేఖర్‌పై ఫిబ్రవరిలో దాడిచేసి, చంపుతామని బెదిరించిన కేసులో నిందితులైన గాలివీడు కళ్యాణ్‌కుమార్, మహమ్మద్ జునైద్, బాబా ఫక్రోద్దీను మంగళవారం చెక్‌పోస్టు వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితులను సబ్‌జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.